# న్యాయానికి కూడు లేదు

రచన: ప్రభాకర్

రైలు కదలబోతోంది. సోడా తాగి చిల్లర లేకపోతే రూపాయి యిచ్చాడు. అతనిదగ్గరా చిల్లరలేదు. చిల్లర తేవడానికి వెళ్లాడు— రైలు కదలింది. చిల్లరకు వెళ్లినవాడు చిల్లర తెచ్చాడా?... నీతి నిజాయితీ వున్నాయా?... వుంటే వాటి మూల్యమెంత?

ట్రైనుకు టైమవుతోంది. స్టేషన్ ఇంకా అరమైలు వుంటుంది. హృదయభారంతో శరీరంకూడా బరువెక్కి అడుగులు భారంగా పడ్తున్నాయి. ఎంత ప్రయత్నించినా నడక సాగటంలేదు పన్నెండు గంటలకల్లా విజయవాడలో ఇంటర్వ్యూకు హాజరవాలి. ఈ ఏడు గంటలబండి ఎక్కితేనేగాని సమయానికి గమ్యం చేరుకోలేను. ఈ బండి తప్పితే మళ్ళీ రెండుగంటలవరకు బండిలేదు. ఉద్యోగం దొరుకుతుందన్న ఆశ నాలో అంతరించినా ఏదో అవ్యక్తమైన వాంఛ నన్ని ఇంటర్వ్యూకు తీసికెళ్తోంది. నేనూ, నా తల్లీ, చెల్లెలూ. మూడురోజులుగా ఒంటిపూట భోజనం చేస్తున్నాం. నేనీ ఇంటర్వ్యూకు ఖర్చుచేసే పది రూపాయలు వుంటే మేము ముగ్గురం నాలుగు రోజులు కడుపునిండా తినగలం. కాని మా అమ్మ "నాలుగురోజులు కష్టపడినా వుద్యోగం దొరికితే చిరకాలం ఆనందం అనుభవించవచ్చు" అని అనటంతో ఇలా బయలుదేరాను. ఈ ఇంటర్వ్యూలో నేను నెగ్గుతానో నెగ్గనో? ఈ వుద్యోగం కేవలం ఎండమావిగానే వుండిపోతుందో లేక నా పాలిటి మానస సరోవరం అవుతుందో అర్థం కాకుండా వుంది.

జేబు మరోమారు తడువుకున్నాను. పది రూపాయిలనోటు పదిలంగానే వుంది. ఈ పది రూపాయలలో రానుపోను చార్జీలుపోను ఒక్క రూపాయ మిగుల్తుంది. ఆ రూపాయి ఈ రోజు భోజనానికి మిగతా అన్ని ఖర్చులకు సరిపెట్టాలి. ఏమిటో ఈ జీవితం! మా నాన్న వున్నప్పుడు నాకేమీ కష్టమనిపించలేదు. కాలేజీ జీవితం చాలా సరదాగా గడిపాను. అప్పుడు టెర్లిన్ షర్టులు, షార్క్సిన్ ప్యాంట్లు తప్ప తొడిగేవాడినిగాను. బి. ఎ పట్టా చేతికొచ్చింది, నాన్న ప్రాణంపోయింది. ఆయన దివంగతులు కాగానే అప్పులవాళ్ళందరూ మాఇంటిపైన ఒక్కుమ్మడిగా దాడి చేశారు. దానితో వున్న ఆస్తి కాస్తా హారతికర్పూరం లా హరించుకు పోయింది. ఇప్పుడు రెక్కాడితేగాని డొక్కాడదు! అప్పటికీ అమ్మ కుట్టుమిషను సహాయంతో కాలం వెళ్ళబుచ్చుతోంది. నేను ఇంటర్వ్యూలమీద ఇంటర్వ్యూలకు హాజరవటమేగాని ఫలితం ఏమీ కన్పించటంలేదు. పైపెచ్చు అదో ఖర్చు! ఈ చదువువల్ల నేను రెండువిధాల చెడిపోయాను — నాకు అటు వుద్యోగం రాదు, ఇటు కాయకష్టం చేయలేను!

ఏమో ఈఇంటర్వ్యూలో సెలక్ట్ అవుతానేమో! ఏమైనా మంచి వుద్యోగమే ఇది. నెలకు రెండువందల రూపాయల జీతం! ఇంకా టి. ఎ. డి. ఎ! ఈ వుద్యోగం కనుక వస్తే మొదటి నెల జీతంతో చెల్లాయికి, అమ్మకీ గుడ్డలు కొనాలి. ఇంటిఅద్దె శెట్టిగారి బాకీ తీర్చెయ్యాలి! ఆ పైన ఏమైనా మిగిలితే నేను గుడ్డలు కుట్టించుకుంటాను. లేకపోతే పై నెలలో కుట్టించుకోవచ్చు. ఉబ్బ!... ఏదో రాయి కాలి బొటనవ్రేలికి గట్టిగా తగిలింది. వేలుపగిలి రక్తంకూడా వస్తోంది... పరిసరాల్ని బట్టి స్టేషన్ ఇంకా చాలాదూరం వుందని గ్రహించాను. నడకలోనే నా మనస్సు ఆలోచనల్లో పరిభ్రమిస్తోంది... ఇవాళ ఇంటర్వ్యూలో ఏమి ప్రశ్నలడుగుతారో, ఏమో? ఇదివరకొక ఇంటర్వ్యూలో నీకెన్నేళ్ళు అని అడిగాడు ఇంటర్వ్యూ ఆఫీసరు ఇరవైరెండని ఠకీమని చెప్పాను. దానికాయన పెద్దగా నవ్వుతూ నీ వయస్సుగాదయ్యా నే నడిగింది నీ ప్రేళ్ళసంగతి అని అన్నాడు. నేను తెల్లమొగం వేశాను. "సమయస్ఫూర్తిలేదు కుర్రాడికి" అంటూ నన్ను వేరే ప్రశ్నలేమి అడగకుండా పంపించివేశారు. ఆ వుద్యోగం ఆయన బావగారి తోడల్లుడి తమ్ముడి బావమరదికి ఇచ్చేశారు. ఇట్లా వుంటున్నాయి ఇంటర్వ్యూలు. కావలసిన సబ్జెక్టు వదిలిపెట్టి చెత్తప్రశ్నలడిగితే ఎవరుమాత్రం సమాధానం చెప్పగలరు? ఇంటర్వ్యూకు రమ్మని పిలవటమేగాని, ఆ వుద్యోగం ఆ ఆఫీసరు బంధువుకి ఎప్పుడో రిజర్వు చేయబడి వుంటుంది న్యాయానికి కూడులేదు.

స్టేషన్ గంట విని ఆలోచనలనుండి తేరుకున్నాను. అంతవరకు మాంద్యంగా సాగుతున్న నా నడక స్టేషను ఆవరణలోకి రాగనే వేగం పుంజుకుంది. రైలుకు రెండోగంట కొట్టారు. గబగబా వెళ్ళి టిక్కెట్టుకొన్నాను. టిక్కెట్టుకుపోను అయిదున్నర రూపాయలు తిరిగి ఇచ్చాడు, కౌంటరు. నాలుగున్నర రూపాయిలు చేతిరుమాలుతో గట్టిగా కట్టి జేబులో పెట్టుకున్నాను. ప్లాటుఫారంమీద కలకలం బయలుదేరింది. బండి స్టేషన్లోకి వస్తోంది. నేనూ ప్లాట్‌ఫారంమీదకు పరుగెత్తాను. అది అసలే చిన్నస్టేషను. బండి రెండు నిమిషాలకంటే ఎక్కువసేపు ఆగదు. ఆకాస్త టైములోనే పాసింజర్లు అందరూ ఎక్కాలి దిగాలి!! బండి స్టేషనులోకి వచ్చి ఆగింది. గబగబా ఒక పెట్టెలోకి ఎక్కి కూచున్నాను. "నీకేగాని తొందర నాకేమిటి?" అన్నట్లు బండి కదలకుండా నుంచుంది. ఇవాళ బండి ఇంతసేపు ఆగిందేమిటి చెప్మా? ఏదైనా క్రాసింగ్ వుందేమో? ప్రొద్దుటినుండి పచ్చి మంచినీళ్ళుకూడా తాగలేదు. విపరీతంగా దాహం వేస్తోంది. కాఫీ తాగితే ఇరవై పైసలు ఇప్పుడే అయిపోతై. సోడా కొట్టువాడు 'చల్లని

(తరువాయి 25 వ పేజీ)

## న్యాయానికి కూడులేదు

(13 వ పేజీ తరువాయి)

సోడా' అని అరుస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు. వాడు ఉదయం ఏడుగంటలనుండీ సోడా అమ్ముతున్నాడు ఎందుకో! బహుశా నాబోటి వారికోసమే నేమో? సోడా కుఱ్ఱవాడిని పిలిచి సోడా తాగాను జేబులో చిల్లగ లేదు. రూపాయనోటు తీసిఇచ్చా . వాడి దగ్గరా చిల్లరలేదు. వాడు చిల్లర తెస్తానని రూపాయనోటు తీసికొని వెళ్ళాడు. కంపార్టుమెంటులోని వాళ్ళంతా 'ఎంత తెలివితక్కువ పనిచేశావు' అన్నట్టు నావేపు చూస్తున్నారు. నిజమే! ఎంత తెలివితక్కువ పని చేశాను. రూపాయనోటు తీసికెళ్ళినవాడు మళ్ళీవస్తాడని నమ్మకమేమిటి? ఈపూటకూడా వుపవాసం వెయ్యాల్సిందే. పాడుసోడా తాగకుండా వున్నా బాగుండేది. అయినా బండికదలలేదుకదా కిందకు దిగి చూద్దామని లేచాను. ఇదే ఆదనుకొని రైలు ఓండ్రపెట్టి ఒక్కుమ్మడిగా స్పీడు అందుకుంది. ఇక ఆ రూపాయకు ఆశలు వదలుకున్నాను. ఎన్నిరోజులు భోజనం చెయ్యకుండా వుండలేదు? అలానే ఈరోజుకూడా! నేను దరిద్రుడనైతే ఆ సోడావాడు గర్భదరిద్రుడు. వాడిని గురించి అంతకంటే ఇంకేమీ అనుకోకలేక పోయాను. రూపాయిపోతే పోయింది ఈ వుద్యోగం వస్తే అదేపదివేలు! మాకంపార్టుమెంట్ ప్లాటుఫారందాటి అలా పది, పదిహేను గజాలు వచ్చిందో లేదో బండి భారంగా గునుస్తూ ఆగింది. ఇంజనువైపు నుండి జనం స్టేషన్ వైపుకు వెళ్తున్నారు మా పెట్టెకూడా సగభాగం ఖాళీఅయింది. ఏమిటో నేను కూడా దిగి వెళ్దామని బయలుదేరాను. గార్డుపెట్టిదగ్గర జనం అంతా గుమిగూడి వున్నారు. గార్డు చేతులు తిప్పుతూ ఏవో చెప్తున్నాడు. నేనూ గబగబా గార్డుపెట్టె దగ్గరకు చేరుకున్నారు భగవాన్! ఎంతఘోరం!! సోడా కుఱ్ఱవాడి శవం రక్తం మడుగులో పడి వుంది, వాడి తలకాయ రెండుపట్టాలకు మధ్య, వాడి మొండెం ప్లాట్‌ఫారంవైపు పడివున్నాయి ఒకచేతిలోని సోడా సీసా పప్పుపప్పుగా పగిలివుంది, రెండోచేతి గుప్పెట్లో ఏవో చిల్లర డబ్బులు వున్నై! స్టేషన్ సోడాకొట్టువాడు కూడా అక్కడే వున్నాడు. ఈ కుఱ్ఱవాడు రూపాయ చిల్లర తీసికొని బయలుదేరాడుట! ఇంతలోనే బండి కదిలింది. ఆ చిల్లరసోడా తాగినవానికి (?) అందచేద్దామనే వుద్దేశ్యంతో బండితోపాటు పరుగెత్తాడు. బండికింద పడ్డాడు. నాకు చిల్లర ఇవ్వటంకోసం వాడు మృత్యువాత పడ్డాడు. అతని మరణం నా నవనాడులనూ కృంగదీసింది అప్రయత్నంగానే నా కళ్ళనుండి వెలువడ్డ రెండు కన్నీటి బిందువులు అతని పాదాలపైన బడినై! 'పాపం' అంటూ ఒక్కొక్కళ్ళే బండి ఎక్కనారంభించారు. ఆఖరుకు స్టేషన్‌మాస్టరు, నేనూ, ఇంకా నలుగురైదుగురు ఇతర ఆఫీసర్లు మిగిలాం! నేనుకూడా భారంగా వెళ్ళి పెట్టెలో కూర్చున్నాను కంపార్టుమెంటులో కూర్చున్న నా మనసు ఆ కుఱ్ఱాడి శవంవేపే పరుగిడుతోంది! కిటికీలోనుండి అతని శవం వైపే తొంగిచూస్తూ కూర్చున్నాను. బండి బయలుదేరింది. శవం వెనక్కు వెనక్కు వెళ్తోంది! మా కంపార్టుమెంటులో ఎవరో ఆ కుఱ్ఱవాడిని గురించి చర్చిస్తూ అంటున్నారు— 'పాపం! "న్యాయానికి కూడులేదు" అని!!!

## ఆ క్షణం

నేనూ అనుకున్నా
భావాలహరుల బంధుత్వంలో
కలగన్నా
భవిష్యత్తును తలపోస్తూ తీయ
దనాల్ని నింపుకున్నా
కానీ—
నే కోరిన సుధామృతాల ఝరులు
సమతాప్రేమామయ వాతా
వరణాలు
కలుషితమై కళంకమై పోతాయని
తలంచలేదు
పరిభాసమాన తేజోమూర్తుల
దలచుకొని
ఉదగ్రవాంఛా పరిష్వంగ
సుఖంతో
ఉన్మాదునిలా యేవేవో ఆశలు
పెంచుకున్నా
అంతర్గతంగా నన్ను నేనే దహింప
జేసుకున్నా.
భూమ్యాకాశాల కలయికల
రూపాలలా
దగ్గిర పడినకొలదీ నిరాశా
శాపాలలా
విడివిడిగా కన్పిస్తూనే వున్నాయి
నాభావాల జ్వాలలు
ఏ క్షణం...? ఏ క్షణం...?
అని నిరీక్షిస్తున్నా
ఉషాకుమారి వలపుకైపులో
గాలిబుడగను నీటిపడవలా నిలబెట్టి
సప్తసముద్రాల కలయికను
వీక్షించేది
ఏ క్షణం...?
తేజోవిరాజితోహ్లాదమయ
వాతావరణం
నయనపర్వంగా వెల్గొందే
శుభతరుణం
కోసం, కళ్ళల్లో వత్తులు వేసుకొని
కాలహేలలో కనలిపోలేని నేను
క్షణమొక యుగంలా నిరీక్షిస్తున్నా
ఆక్షణం... ...ఎప్పుడొస్తుంది?
ఎలావుంటుంది... ఆ క్షణంలో??

—'సుప్రభాతమ్'